# జవహరి

"వేసవికాలం వస్తోందంటే చాలు రిజర్వేషన్ కౌంటర్లన్నీ కిటకిటలాడిపోతాయి. ఎండలోపక్క మాడ్చేస్తుంటే ఈ జనాలు ఎవరి కొంపల్లో వాళ్ళు పడుండక ఊళ్ళట్టుకు తిరగడం ఎందుకో! ఇంటిపట్టున హాయిగా ఎలా ఉండొచ్చో ఒకళ్ళకీ తెలిసి చావదు. దానికితోడు ఈ గవర్నమెంటు వాళ్ళు అందరికీ ఎల్‌టిసిలిచ్చేసి ఊళ్ళమ్మట తిరగండో అని తోల్తున్నారు." పాపం ఎండవేడికి, ఉక్కపోతకి తాళలేక క్యూలో నిలబడ్డ ముసలాయన దేశంలో అందరినీ తిట్టి పోస్తున్నాడు. కాని మరి ఆయన ఏ అవసరం పడి ప్రయాణం పెట్టుకున్నాడో!

అసలే అది ఢిల్లీ రూటు, రిజర్వేషన్ కౌంటరు. అందులో వేసవి కాలం. పైపెచ్చు ఎసి క్లాసులకి. ఇంక చెప్పేదేముంది. కానీ విచిత్రం. సరిగ్గా నెలతర్వాత ఇదే రోజుకి అంటే మే 12కి ఎ.పిలోనూ, దక్షిణ్‌లోనూ కూడా బెర్తులున్నాయని పచ్చలైట్లు వెలుగుతున్నాయి. ఇంతలో ముసలాయనకి ముందున్న ఒక సగటు ప్రాణి చేతులు లోపలికి పెట్టి మూడు ఫారాలిచ్చాడు.

"మూడు ఫారాలేవిటయ్యా!"

"ఒక్కోదాన్లో ఆర్గుర్ని కన్నా నింపరాదు గద సార్. ఖాందాన్ మొత్తం పోవాలగద. ఇంట్ల లగ్గమాయె!"

"ఇలాటి వాటికి గ్రూప్ రిజర్వేషన్ అడగొచ్చయ్యా! ముగ్గురి సంతకాలు తెచ్చావు. గట్టివాడివే!"

"పెద్దసేటు, డాలీ బేబి, మున్షీసాబు చేసిన్రండి."

"మే 12, నాగపూరు, ఎ.పిలో రెండే ఉన్నాయయ్యా."

"ఎ.పి లేకుంటే దక్షిణ్ తెమ్మన్నాడు సేటు."

"దక్షిణ్‌లో పదమూడున్నాయి. మూడు ఆర్ఎసి. పనికొస్తుందా?"

"కానియ్ సారూ!"

"సేట్ మానిక్‌లాల్ 75, వందనాదేవి 70, రతన్‌లాల్ 52, లక్ష్మీదేవి 50, నందలాల్ 50, రుక్మిణీబాల 46, ప్రేమలాల్ 46, ఆశాజ్యోతి 40, పరిమల్‌సోనీ 50, కిరణ్‌సోనీ 48, అర్చన 18, ప్రేమలత 16, కన్హయ్య 16, మందాకిని, వినోద్, మధుబాల 11, 11, 11 ... చాలా మంది పదకొండులున్నారే."

"పెద్ద సేరు మనుమలండి. ఒక్క సంవత్సరంలో ముగ్గురు బిడ్డలయ్యా రింటికి." ఎంతయిందో లెక్క చెప్పాడు కౌంటర్లోని ఉద్యోగి. అన్నీ అయిదు వందల నోట్లిచ్చి టిక్కెట్లన్నీ సరిచూసుకుని ఆనందంగా వెళ్ళిపోయాడా పెద్ద మనుషుల ఇంటి మనిషి.

వెనకాతల నిలబడ్డ ముసలాయన ఎ.పిలో ఢిల్లీకి రెండు బెర్తులు కొనుక్కుని మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఆయనకి టిక్కెట్టు దొరక్కపోతే ఇంకా ఎందరిని శాపనార్థాలు పెట్టేవాడో మరి!

అప్పటి దాకా ఎ.పికీ, దక్షిణ్‌కి కూడా పన్నెండో తారీక్కి పచ్చలైట్లు చూపిస్తున్న బోర్డొక్కసారి ఎర్రలైటు చూపించడంతో 12వ తారీఖున ప్రయాణం పెట్టుకున్న వాళ్ళు ఖంగారు పడ్డారు. ఇప్పటిదాకా రెండూ ఉన్నాయి. ఇంతలోకే అయిపోయాయా అనుకుని ప్రయాణం తేదీ ఎక్కడికి జరపాలో అన్న ఆలోచనలో పడ్డారు.

"అసలూ ఆ ముందు వాడికి పదహారు టిక్కెట్లెలా ఇచ్చారు? వాళ్ళకీ వాళ్ళకీ ఏవో ఉంటాయి. అన్నీ బ్లాకులో అమ్మేస్తారు" నిత్య శంకితుడి ఉవాచ.

"అలాటిదేమీ లేదండి. సుల్తాన్ బజార్‌లో మాణిక్‌లాల్ జ్యూవలర్స్ లేరూ! వాళ్ళింట్లో పెళ్ళిట. మొత్తం అందరూ వెడుతున్నారుట" సత్యపరిశోధకుడి రిపోర్టొచ్చేసింది.

కలిగిన వాళ్ళింట్లో పెళ్ళి ప్రయాణం. మరి ఎంత సందడి. రాత్రి ఎనిమిదింటికి హైదరాబాద్‌లో దక్షిణెక్కితే తెల్లవారి ఎనిమిది కల్లా నాగపూరు వచ్చేస్తుంది. కానీ వాళ్ళ వాలకం చూస్తే జీవితానికి సరిపడా తిండి తెచ్చుకున్నట్లున్నారు. రెండు పెద్ద కారియర్లు, రెండు డబ్బాలు, ఐసువాటరు జగ్గు చిన్న సైజు గంగాళమంతది, సంత్రాలు, మావిడిపళ్ళు, ద్రాక్షపళ్ళు ఉన్న వెదురుబుట్ట, బక్కెట్టుడు ఐస్‌లో జలకాలాడుతున్న కోకాకోలా సీసాలు, కాకుండా రెండు పెద్ద పెట్టెలు, 4 విఐపి సూటుకేసులు, ఓ పెద్ద మ్యూజిక్ సిస్టం వగైరా వగైరాలతో అంతా నాంపల్లి స్టేషన్లో రైలు బయలుదేరుతోందనగా ఎక్కారు. ఆ కుటుంబపు ఆడవాళ్ళు మంచి మంచి కోటా చీరలు సంప్రదాయంగా నెత్తి మీద కొంగు వచ్చేలా కట్టుకుని ఉన్నా పిల్లలు మాత్రం నేటి కాలానికి తగ్గట్టు జీన్స్, షర్టులతో ఫాషనుగా ఉండి ఇంగ్లీషులోనే మాట్లాడుకుంటూ వాళ్ళ లోకంలో వాళ్ళున్నారు. తెల్లగా, సన్నగా జాజి మొగ్గల్లా ఆడపిల్లలు, యాపిల్

పళ్ళుల్లా మగపిల్లలు. ఆడపిల్లలెంత స్టైలుగా ఉన్నా ఒంటిరవ్వ ముక్కు పుడకలు మెరవడం మానట్లేదు.

వృద్ధ దంపతులిద్దరూ సకుటుంబంగా సర్దుకుని కూచుని సామానంతా సరిచూసుకునేటప్పటికి రైలు బయల్దేరింది. మాణిక్‌సేటు గారికి హైదరాబాదు నగరంలో నాలుగు జ్యూయలరీ షాపులు, అవి చూసుకునేందుకు ముగ్గురు కొడుకులు, ఒక అల్లుడు ఉన్నారు. కుటుంబమంతా ఒకే కప్పుకింద జూబిలీ హిల్సులో రాజప్రసాదంలాంటి ఇంట్లో, కాపలావాళ్ళూ, కుక్కల రక్షణలో ఉంటారు. యాభై ఏళ్ళ క్రితం రాజస్థాన్ నించి పైపంచతో వచ్చినవాడు తెలివి తేటలు, నిజాయితీ, శ్రమ, పెట్టుబడిగా పెట్టి ఈనాడింతవాడయ్యాడు. వాళ్ళ దుకాణాలలో ఏదో ఒక వస్తువు కొనేందుకు ఎప్పుడో ఒకసారి వెళ్ళని హైదరా బాద్ పౌరులుండరు. ఈయన హైదరాబాదునేల్తుంటే, ఈయన ఒక్కగానొక్క తమ్ముడు జవహర్‌సేట్ నాగపూర్‌ని పరిపాలిస్తున్నాడు. ఆయనకీ నలుగురు కొడుకులే. పెద్ద మనవడి పెళ్ళి. మరి ఎవరు వెళ్ళకపోయినా కుదరదు. పిల్లలు, ఆడవాళ్ళు కొన్నాళ్ళక్కడ ఉండిపోయినా మగవాళ్ళు పెళ్ళవగానే తిరిగి వచ్చే స్తారు. దుకాణాలొదిలేందుకు లేదు కదా? సికింద్రాబాద్‌లో ఒక నడివయస్సు జంట ఎక్కి పెద్ద సేటుగారి బెర్తుల దగ్గిరున్న దారి బెర్తుల దగ్గిర సర్దుకున్నారు.

రైలు సికింద్రాబాద్ వదలి ఖాజీపేట వైపుకి పరుగులు తీస్తోంది. బయట ఎంత వేడిగా ఉంటే ఎవడికి పట్టింది? లోపలయితే హాయిగా చల్లగా నవంబరు నెలలో ఆరుబయటున్నట్లుంది. కాకపోతే ఎ.సిల్లో రాత్రి ప్రయాణాల్లో బయటకి చూద్దామని తలతిప్పితే మనమొఖమే కనిపిస్తుంది. అందుకే పాపం మర్యాద కాదని తెలిసినా కొందరు ఎదుటి వాళ్ళని చూస్తూ పరిశీలిస్తూ కాలక్షేపం చేస్తారు. పెళ్ళి వారిలో ఆడవాళ్ళు పిల్లలు ఇంటి నుంచి, మగవాళ్ళంతా షాపుల నించి వచ్చినట్లున్నారు. అందుకే భోజనాల తతంగం రైల్లోనేలా ఉంది. ఆడవాళ్ళం దరూ ఆ ప్రయత్నాలలో పడ్డారు. రెండు అల్యూమినియం పెట్టెలు మధ్యకి లాగి రైలు వారిచ్చిన తెల్ల దుప్పటి పరిచేటప్పటికి డైనింగు టేబులు తయారయి పోయింది. లెఖ్ఖగా తళతళలాడే పదహారు స్టీలు ప్లేట్లు, గ్లాసులు, కటోరీలు, చెంచాలు టేబుల్ నలంకరించాయి. ఈ లోపల పిల్లలు జగ్గులోంచి ఐస్ ముక్కలు వేసిన చల్లని నీళ్ళు గ్లాసుల నిండా పోశారు. కారియరు విప్పగానే కమ్మటి నేతి వాసన. తెల్లటి బట్టలో మూట కట్టిన రొట్టెల దొంతర. పచ్చి మిరపకాయల కూర, వడియాల కూర, పెసరపప్పుతో హల్వా, కోవా కచోరీ,

పెరుగు. ఆ ఆడవాళ్ళెంత శ్రద్ధగా ఆ భోజనం తయారుచేయించారో మరి. ఒక గంటసేపు కబుర్లు, కేరింతలు మధ్య పెళ్ళివారి భోజనాలయ్యాయి. ఇంతలో ఎవరో పిల్లలు మ్యూజిక్ సిస్టం ఆన్‌చేశారు. మధ్య మధ్యలో పండ్ల ముక్కలు తింటూ మగవాళ్ళు పేకాడుకోవడం మొదలుపెట్టారు. వాళ్ళలో వాళ్ళే ఏవో నిదానంగా మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ భుక్తాయాసం తీరేవరకు పేకలాడు కున్నారు.

మగవాళ్ళ భోజనాలవగానే ఆడవాళ్ళు కూడా ఆ పని కానిచ్చేసి పడకల ఏర్పాట్లు మొదలుపెట్టారు. రైలు వారిచ్చిన దుప్పట్లు నీటుగా సర్ది వాళ్ళిచ్చిన దిళ్ళే కాకుండా వాళ్ళు కూడా తెచ్చుకున్న మెత్తలు కూడా పైబెర్తుల మీద పెట్టారు. పిల్లలు రెండు రకాల రూం స్ప్రేలు కొట్టారు. దాంతో కంపార్ట్ మెంటంతా పెళ్ళి పందిరిలా గుబాళించింది. ఆ అంగనామణులంతా ఇదంతా సర్వసాధారణమైనట్లు రొటీనుగా పనిచేసుకుని పోతున్నారు. అందర్లోకీ చిన్నావిడ అత్తగారి కాళ్ళ దగ్గిర కూచుని ఇంకోసారి కొంగు సరిచేసుకుని 'పావ్ దబాదూ మాజీ!' అని అడిగింది.

'న బేటా! జా! సోజా!' అని ముసలావిడ పడుకోడానికి పర్మిషనిచ్చేసింది.

వీళ్ళ పద్ధతులన్నీ నోరు తెరుచుకుని చూస్తున్న సికింద్రాబాద్‌లో ఎక్కిన పెద్ద మనిషి పెళ్ళాం వేపుకి తిరిగి 'చూశావా! అత్తగారంటే ఎంతగౌరవమో! ఎలాగైనా ఉత్తరాది వాళ్ళ తీరేవేరు' అన్నాడు. ఆవిడ తలెత్తకుండానే 'పెద్దావిడ చేతికి నాలుగు గాజులున్నాయే. మధ్యవి అచ్చ రవ్వలు అటు ఇటు అచ్చ కెంపులూను మరి' అని మళ్ళీ పుస్తకంలో పడిపోయింది. ఏది ఏమైనా మన పవిత్ర భారతదేశంలో నిమ్మళంగా, సుఖంగా బతకాలంటే భగవంతుడు అష్ట దరిద్రాల నిచ్చినా ఫరవాలేదు. అనుకూలవతి అయిన ఒక్క పెళ్ళానిస్తే చాలు. ఇక వాడు చక్రవర్తే కదా!

ఇంతలోకి ఖాజీపేట రానేవచ్చింది. రైలెక్కగానే అందరికీ నిద్దరా, ఆకలీ రెండూ ఎక్కువవుతాయదేవిటో! అప్పటికే కొందరు మంచి నిద్దట్లో వున్నారు. సన్నగా పాలిపోయినట్లున్న ఒక పెద్దావిడని చక్రాల కుర్చీలో తోసుకుంటూ వచ్చి ఇద్దరు వయస్సు మళ్ళిన వాళ్ళే రైలెక్కించి వాళ్ళూ సామాన్లు చూసుకుని కూచున్నారు. ఈ లోపల ఓ కుర్రాడు పరిగెత్తుకుంటూ వచ్చి మంచినీళ్ళ బాటి లందించాడు. ఇద్దరివీ లోయరు బెర్తులు, ఒకళ్ళకి పైనొచ్చింది. ముసలాయన్ని పైకెక్కేందుకు సాయంచేసి 'అమ్మా! జాగర్తమ్మా! అన్నయ్యాని నిజాముద్దీను

స్టేషనుకి రమ్మని ఫోన్ చేస్తాను. మీరు దేనికీ దిగక్కరలేదు' అని తల్లికి చెప్పి నిద్దర పట్టక కబుర్లు చెప్పుకుంటున్న పిల్లల్ని చూసి 'బేబీ! జర హమారీ అమ్మాకా ఖ్యాల్ రఖనా!' అని చెప్పి దిగిపోయాడు.

మళ్ళీ రైలు బయలుదేరింది. అంతటా లైట్లు ఆరిపోయి లేతనీలం బల్బులు వెలిగాయి. మండు వేసవైనా లోపల చలనిపించడంతో అందరూ రగ్గులలోకి దూరిపోయారు. కోడళ్ళందరూ బతిమాలడంతో యశోద కృష్ణుడ్ని జోకొట్టే హాయైన మార్వాడీ పాటలు పెద్దావిడ సన్నటి గొంతుతో పాడసాగింది. పది నిమిషాల్లో కంపార్ట్‌మెంటంతా నిద్దట్లోకి జారుకుంది. రామగుండం దాటేసి నట్లుంది. తెల్లారుతూనే నాగపూర్ వచ్చేస్తుంది.

"సబ్ బడేలోగ్ ఏక్ తరఫ్ హోజావ్, జల్దీ జల్దీ మాల్ నికాల్! ఏ సేట్ జర లెవ్వు! నోరెత్తినావంటే నీ కొడుకు దక్కడు. ఆడోళ్ళ పెయ్యిమింద నగలిం దిట్లెయ్యమను. లేకుంటే బద్నామయితవు!" రతన్‌లాల్ కంఠం మీద కత్తిపెట్టి ఖాజీపేటలో రైలెక్కిన ముసిలాడు బొంగురు గొంతుకతో బెదిరిస్తున్నాడు. పక్క బెర్తుల్లో జనాలంతా నిజంగానే నిద్దట్లో ఉన్నారో లేదో పరమాత్ముడికి తెలియాలి. ఒక్క ముసుగు కదల్లేదు. ఆడవాళ్ళు నలుగురూ పక్కకి చేరారు వణుకుతూ!

"బచ్చోంకో ఉఠనాసై" పిల్లల్ని కదలనీయలేదు.

రతన్‌లాల్ భార్య లక్ష్మీదేవి ఆయన కాళ్ళు పట్టేసుకుంది.

'భాయి సాబ్! ఉనే ఛోడ్‌దో! హమారా సబ్‌కుఛ్ లేలో! హమారా మాలిక్‌కో ఛోడ్‌దో?"

చక్రాల కుర్చీలో వచ్చి రైలెక్కిన ముసలావిడ ఛెంగున లేచి కూచుని పెద్ద బ్యాగు మధ్యన పెట్టింది. రకరకాల గాజులు, రవ్వల ఉంగరాలు, పతకాలు, గొలుసులు అందరి వంటి మీదున్న నగానట్రా తిన్నగా బ్యాగులోకెళ్ళిపోయింది.

"ఖోలో! ఖోలో బాక్సాం ఖోలో" అని పెట్టెలు తెరిపించాడు. కత్తింకా రతన్‌లాల్ గొంతు మీదే ఉంది. బాక్సుల్లో ఉన్న బట్టలన్నీ చిందర వందర చేశాడు. ఏవీ దొరకలేదు.

"ఇంత పెద్ద సేటువి. ఏం పెళ్ళికి పోతున్నావురా! బికారోని లెక్కున్నవు! ఛూ! పైసలేదున్నయి. తియ్యంగ్రా" అందరి జేబుల్లో కలిపితే పది వేలు పోగయ్యాయి.

"స్టేషనొచ్చేటట్లున్నదన్నా" వాడి చెవులో ముసల్ది ఊదింది.

వెంటనే చైనులాగి రైలు స్లో అవగానే ముగ్గురూ దూకి పారిపోయారు. రెండు మైళ్ళ తర్వాత రైలాగింది. అంతా లైట్లేశారు. ఏమయిందని అనుకుంటూ వచ్చారు రైలు అధికారులు. విషయమంతా విని రిపోర్టు రాసుకుని ఫోటోలు తీసుకుని పోలీసులు వెళ్ళిపోయారు పంచాయితీ అయిన పది నిమిషాలకి రైలు బయలుదేరింది.

పెళ్ళివారి ముఖంలో కత్తివేటుకి నెత్తురుచుక్కలేదు. బిక్కచచ్చిపోయా రందరూ. తలా గ్లాసు మంచినీళ్ళు తాగి పెట్టెలన్నీ మళ్ళీ సర్దుకున్నారు. ఆడ వాళ్ళేదో మాట్లాడబోతే ఒక్క కసురు కసిరాడు పెద్దాయన. అందరి ఉత్సాహాలు చప్పగా చల్లారినట్లయి మళ్ళీ ముసుగులెట్టారు లైట్లార్పి.

తెల్లవారుతుండగానే అందర్నీ నిద్దర్లు లేపింది పెద్దావిడ. ఏదో చిన్న స్టేషన్లో చాయ్‌లు తెప్పించుకుని తాగారు. ఒక్క నగకూడా వంటిమీద లేకపోవడంతో ఆడవాళ్ళందరూ అభ్యంగన స్నానానికెళ్ళబోయే లక్ష్మీదేవుల్లా ఉన్నారు. మిగతా ముస్తాబులయితే చక్కగా అయి మంచి బట్టలు కట్టుకున్నారు. మగవాళ్ళు పెద్దాయనతో సహా కోట్లేసుకుని తలపాగాలు కూడా పెట్టుకున్నారు. ఎందుకంటే ఆ కుటుంబాలకన్నిటికీ మాణిక్ సేటే పెద్ద కదా. రిసీవ్ చేసుకునేందుకు ఆడ పెళ్ళివారు కూడా వస్తారు మరి!

ఎనిమిదయ్యేటప్పటికి నాగపూరు వచ్చేసింది. రాత్రి జరిగిన సంఘటన అందరూ పక్కకినెట్టేసి నవ్వు ముఖాలతో రైలు దిగారు. స్టేషనుకి బాండు మేళంతో సహా పెళ్ళివారొచ్చారు. 'పాయ్ లాగూ బాపు, మాజీ!' అంటూ అందరూ పెద్ద వాళ్ళిద్దరికీ కాళ్ళ దణ్ణాలు పెట్టేస్తున్నారు. మేం మాత్రం తక్కువా అని రైల్లో వచ్చి దిగిన సేటులు పినతండ్రికదే పని చేశారు. అందరూ కుశల ప్రశ్న లేసుకుని గేటు వైపుకి వెళ్ళసాగారు.

నాలుగు బోగీలవతల ఎస్-6 కంపార్టుమెంటులోంచి ఇద్దరు పహిల్వాన్లు, గుమస్తాలు తోడురాగా సేఠ్ మాణిక్‌చంద్ జ్యూయలర్సుగారింటి అసలైన పెళ్ళి జవహరి, నాలుగు పెద్ద అల్యూమినియం పెట్టెలలో దాక్కొని నిరాడంబరంగా నిశ్చింతగా కట్టుదిట్టంగా ఆడ పెళ్ళివారి వానెక్కింది.

**8-12-2000, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక**

✦ ✦ ✦